
సమస్యల పరిష్కారానికే 'డయల్ యువర్ డీఎం'



కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికే 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో శుక్రవారం'డయల్ యువర్ డీ.ఎం' నిర్వహించారు. కిష్టారెడ్డిపేట్‌కు మరిన్ని బస్సులను నడపాలని, అదేవిధంగా పాపిరెడ్డికాలనీకి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు కోరారు. ట్రిపుల్‌ఐటీ జంక్షన్ నుంచి 15.30 గంటల నుంచి మరిన్ని బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారు. ఆయా ప్రాంతాలలో సర్వే నిర్వహించి బస్సుల సంఖ్య పెంచడం, నడపడంపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు రూ.9.10 కోట్ల పనులకు శంకుస్థాపన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో రూ.9.10 కోట్ల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. నల్లగండ్ల హుడా కాలనీలో రూ.24.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు , అదేవిధంగా హుడాకాలనీలోని ఎపి స్టెమో స్కూల్ సర్కిల్ నుంచి రాంకీ ఆర్బిట్ గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.8.50 కోట్ల పనులకు, రాంకీ కాస్మోస్ నుంచి నవోదయ కాలనీ వరకు భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ రూ.36 లక్షల పనులకు శంకుస్థాపన చేస్తారు.

ప్రణాళికాబద్ధంగా సాకి చెరువు అభివృద్ధి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువును ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.శుక్రవారం చెరువులో గురప్రు డెక్క తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7 కోట్ల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు పట్టణ ప్రజల కోసం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే గాంధీ



హెచ్ఏఎల్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని హెచ్ఏఎల్ కాలనీలో రూ.4 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఏఎల్ కాలనీ తోపాటు కెఎంఆర్ ఎస్టేట్, పారామౌంట్ కాలనీతో పాటు చుట్టూరా ఉండే కాలనీలవాసులకు సౌకర్యం కలుగుతుందన్నారు. ప్రజల కోరికపై రూ.4 కోట్ల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు, డివిజన్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'ఎన్ఐఏబీ'లో స్టూడెంట్ నెట్‌వర్కింగ్, ప్లేస్‌మెంట్ కాంక్లేవ్-2025



కార్యక్రమంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏనిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) క్యాంపస్‌లో 'ఐబీఆర్ఐసీ' స్టూడెంట్ నెట్‌వర్కింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కాంక్లేవ్-2025 కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఎన్ఐఏబీ క్యాంపస్‌లో కేంద్ర బయోటెక్నాలజీ శాఖ, బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (బీఆర్ఐసీ), సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్(సీడీఎఫ్‌డీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఐబీఆర్ఐసీ సంస్థల నుంచి దాదాపు 71 మంది సీనియర్ డాక్టోరల్ విద్యార్థులు, 30 ప్రముఖ బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చా కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పరిశ్రమలు-విద్యాసంస్థలను ఏకం చేస్తేనే ప్రతిభావంతులు అందుబాటులోకి వస్తారన్నారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ.బిఎస్ మూర్తి, మ్యాప్ మై జీనోమ్ సీఈఈ డాక్టర అను ఆచార్య , వివిధ ఉన్నత సంస్థల ప్రతినిధులు, గౌలిదొడ్డిలోని ఎన్ఐఏబీ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఆలోచనలకు గుర్తింపు, వ్యవస్థాపకులకు సాధికారత

- టీజీఐసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మెరాజ్ ఫహీమ్
- 'ఇన్నోవేషన్ పంచాయతీ వాల్యూమ్-1' ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్(టీజీఐసీ)లో శుక్రవారం 'ఇన్నోవేషన్ పంచాయతీ వాల్యూమ్.1' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మెరాజ్ ఫహీమ్ మాట్లాడుతూ ఇది టీజీఐసీ సరికొత్త కార్యక్రమమని, వినూత్న ఆలోచనలకు, వాటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన తోడ్పాటుకు మధ్య వారధిగా నిలుస్తుందన్నారు. 'ఓపెన్ డోర్ ఇన్నోవేషన్ పంచాయతీ' ఆవిష్కర్తలకు, స్టార్టప్ వ్యవస్థాపకులకు మార్గదర్శకత్వం, సలహాలను పొందేందుకు వేదికను అందించినట్లయిందన్నారు.3 నెలలపాటు ఆగష్టు వరకు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. ఆవిష్కరణ, వ్యవస్థాపక వ్యవస్థ నుంచి ఉత్తమ నిపుణులను నేరుగా మీ వద్దకు తీసుకురావటమే కాకుండా, ప్రతి ఒక్కరి ఆలోచనలకు గుర్తింపు లభించేలా, ప్రతి వ్యవస్థాపకుడికి సాధికారత లభించేలా చూస్తున్నామన్నారు. ప్రతినెలా మూడవ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి టీహబ్ వేదికగా జరుగుతుందన్నారు.

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ

రాయదుర్గం: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్-2025లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెరిసింది. దేశంలోనే ఉన్నత విద్య, పరిశోధనలకు ప్రముఖ కేంద్రమైన హెచ్‌సీయూ ప్రతిష్టాత్మకమైన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) ఇంపాక్ట్ ర్యాంకింగ్స్‌లో స్థానం సంపాదించింది. మొదటి సారిగా హెచ్‌సీయూ ప్రపంచవ్యాప్తంగా టాప్ 601-800 స్థానం సంపాదించింది.

నివాళి



మహేందర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ కృష్ణ తదితరులు

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మహేందర్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చిత్రపటానికి సర్కిల్ ఏఎంసీ కృష్ణ, విజయ్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఆర్ నగర్‌లో అంత్యక్రియలు చేశారు.

క్రమశిక్షణతో చదవాలి

చందానగర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకాష్ ఎడ్యుకేషన్ సెంటర్, సీఎంఎస్ కాలేజీ బ్రాంచీని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకాష్ దక్షిణ ఆపరేషన్ హెడ్ నిశాంత్ శ్రీ వాత్సవ, చీఫ్ అకాడమిక్ బిజినెస్ హెడ్ అమిత్‌కుమార్ ఉరిటి, సీఎంఎస్ కాలేజ్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, మారబోయిన రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ కాలనీకి చెందిన బత్తుల నర్సింగరావుకు రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరైంది. మంజూరుపత్రాన్ని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యుడికి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు.

చైతన్య విద్యాసంస్థల ఆకస్మిక తనిఖీ

సీజ్ చేయమని ఆదేశాలు జారీచేసిన నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ హుస్సేన్ నాయక్



మాదాపూర్‌లోని చైతన్య కళాశాలను తనిఖీ చేసిన ఎన్‌సిఎస్‌టీ మెంబర్ జాటోద్ హుస్సేన్ నాయక్

మాదాపూర్: మాదాపూర్‌లో చైతన్య విద్యా సంస్థలను నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ హుస్సేన్ నాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాసిరకం భోజనాన్ని పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎన్‌సిఎస్‌టీ హుస్సేన్ నాయక్ తెలిపారు. పాడైన చట్నీలు, పప్పు, పురుగుల సాంబారు లాంటి పదార్థాలను వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకోకుండా తమ చేత డబ్బులు ఇప్పించి సెక్యూరిటీతో తెప్పించుకోమని కాలేజీ సిబ్బంది చెబుతున్నారని ఈ సందర్భంగా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలలో పర్మిషన్లు ఒక బ్రాంచ్‌కి తీసుకుని అదే పర్మిషన్‌తో అన్ని బ్రాంచ్‌లను నడిపిస్తున్నారని దీన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులను సీజ్ చేయమని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంక్యానాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు

- 11 కేవీ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి, ఎన్‌టీఆర్ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు గుల్‌మొహర్ పార్కు కాలనీ ఏరియాలో విద్యుత్ ఉండదు.

చందానగర్‌లో..

చందానగర్: వేమన కాలనీ, చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు పీజేఆర్ రోడ్డు నంబర్ 1,3,5,7,10,12, లగ్జరీ హైట్స్ అపార్ట్‌మెంట్స్ ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.
- సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి 10.30 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, విద్య నగర్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో ..
- సీబీఆర్ ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 3.30 నుంచి 4.00 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, ఆంధ్రాబ్యాంక్ దగ్గర, శ్రీ దుర్గ ఎస్టేట్స్, క్రోమ భవనం వెనుక ప్రాంతాలలో.